సాక్షి
తిరుపతి

సోమవారం, 22, జనవరి, 2024



పంటలపై ఏనుగుల దాడి

పంటలపై ఏనుగుల గుంపు దాడి చేసి ధ్వంసం చేసిన సంఘటన ఆదివారం చంద్రగిరి మండలంలో వెలుగుచూసింది. - 8లో



వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తను బొజ్జల సుధీర్ రెడ్డి అనుచరులు దాడి చేసిన సంఘటన శ్రీకాళహస్తిలో చోటుచేసుకుంది. - 8లో



రజకులను ఎస్సీలో చేర్చాలి

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలంటూ జాతీయ దోబీ మహాసంఘ్ విజయవాడకు పాదయాత్ర చేపట్టింది. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 76,041 మంది స్వామివారిని దర్శించుకోగా 28,336 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.06 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, దర్శన టికెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

కలెక్టరేట్‌లో నేడు స్పందన

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ మేరకు అన్ని విభాగాలకు చెందిన జిల్లా అధికారులు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేశారు. అర్జీలను రాసి ఇవ్వడానికి ప్రత్యేకంగా ముగ్గురు వీఆర్వోలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అర్జీదారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి స్పందన కార్యక్రమం చక్కటి వేదికగా పేర్కొన్నారు. జిల్లా వాసులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శ్రీవారి సేవలో ప్రముఖ సినీ నటి శ్రియ



తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం ప్రముఖ సినీ నటి శ్రియ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలు అందించారు. అంతకుముందు ఆమె తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని సినీ నటి శ్రియ ఆదివారం దర్శించుకున్నారు.

లా కోర్సులో స్పాట్ అడ్మిషన్స్

తిరుపతి సిటీ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని లా విభాగంలో ఎల్ఎల్‌బీ 5 ఏళ్లు (7 సీట్లు), ఎల్ఎల్‌బీ మూడేళ్ల వ్యవధి (13 సీట్లు), ఎల్ఎల్‌బీ 2 ఏళ్ల కోర్సుల్లో (8 సీట్లు) స్పాట్ అడ్మిషన్స్ ఈ నెల 23వ తేదీ నుంచి 26 వరకు నిర్వహించనున్నట్లు న్యాయ విభాగం అధిపతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023 పరీక్షల్లో క్వాలిఫై అయిన ఏపీ లాసెట్‌కు, ఏపీ పీజీ లా సెట్‌కు చెందిన వారు స్పాట్ అడ్మిషన్లకు అర్హులుగా పేర్కొన్నారు. ఈ కోర్సులో అర్హులైన విద్యార్థినులు విద్యార్హత పత్రాలు, గుర్తింపు కార్డు, ఫొటోలు, ర్యాంకు కార్డు తీసుకురావాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్లో చేరిన విద్యార్థినులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ లభించదని, హాస్టల్ వసతి ఉండదని స్పష్టం చేశారు.

తిరుపతి- విశాఖ బస్సు సర్వీసు

తిరుపతి అర్బన్: నగరంలోని మంగళం డిపోకి చెందిన ఇంద్రా ఏసీ బస్సు సర్వీసును సోమవారం నుంచి తిరుపతి–విశాఖపట్నంకు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ భాస్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి సాయంత్రం 4 గంటలకు ఈ బస్సు బయల్దేరుతుందని వెల్లడించారు. అదేవిధంగా విశాఖపట్నం నుంచి ప్రతి రోజు సాయంత్రం 5 గంటలకు తిరుపతికి బయలుదేరుతుందని స్పష్టం చేశారు. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అప్రైజర్ నూతన కమిటీ ఎంపిక



నూతన కమిటీని ప్రకటిస్తున్న కఠారి విజయకృష్ణ

తిరుపతి కల్చరల్: భారత్ బ్యాంక్ యూనియన్ అప్రైజర్ రాష్ట్ర నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఆదివారం నిర్వహించిన ఏపీ అప్రైజర్స్ సమావేశానికి రాష్ట్రంలోని 16 జోన్లకు సంబంధించిన అప్రైజర్స్ హాజరయ్యారు. సమావేశంలో చర్చించి భారత్ యూనియన్ బ్యాంక్ అప్రైజర్ రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. భారత్ యూనియన్ బ్యాంక్ అప్రైజర్ సంఘం రాష్ట్ర చైర్మన్‌గా కఠారి విజయకృష్ణ, అధ్యక్షులుగా కె.బాలాజీ, కోశాధికారిగా నాగపద్మను ప్రాథమికంగా ఎన్నుకున్నారు.



ప్రసంగిస్తున్న విజయసాయిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే కిలివేటి, ఎండీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



సాధికార యాత్రకు హాజరైన జనసందోహంలో ఒక భాగం



అతిథులకు గజమాలతో స్వాగతం

సామాజిక జైత్రయాత్ర

ఒక కుటుంబంలో చిచ్చుపెట్టి, బంధాలను చీల్చే కుట్ర రాజకీయాలు... అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అబద్ధపు ప్రచారాలు... చంద్రబాబు, ప్యాకేజీస్టార్ పవన్ కలిసి చేస్తున్న దగాకోరు రాజకీయాలు... ఇవన్నీ ఒక ఎత్తయితే పచ్చ పత్రికలు రాస్తున్న తప్పుడు కథనాలు... టీవీ చానెళ్లలో జగనన్నపై చేస్తున్న దుష్ప్రచారం... వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎలాగైనా సరే ముఖ్యమంత్రి పీఠం నుంచి దించాలనే ప్రతిపక్షాల కుతంత్రాలు.. ఇవన్నీ కలిసి రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీయాలని చూస్తుంటే, ప్రజలు మాత్రం జగనన్న వెంటే అంటూ సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన జనసంద్రం చెబుతోంది. ఇది జైత్రయాత్రలా సాగింది.

- బస్సు యాత్రకు నాయుడుపేటలో నీరాజనం
- పాత బస్టాండ్ ప్రాంతం జనసంద్రం
- మళ్లీ జగనన్నే సీఎం కావాలంటూ నినాదాల హోరు





సామాజిక సాధికార వేదికపై నేతల సంఘీభావం, వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట : నియోజకవర్గంలోని నాయుడుపేట పట్టణంలో ఆదివారం చేపట్టిన సామాజిక సాధికార యాత్రతో పట్టణమంతా జనసంద్రంలా మారింది. గుండెలనిండా జగనన్నపై అభిమానాన్ని నింపుకుని పట్టణ వీధుల్లో జగనన్న సైనికులు కవాతు నిర్వహించినట్టుగా సాగింది సామాజిక సాధికార యాత్ర. సంక్షేమ పథకాల సృష్టికర్త, నిరుపేదల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చిన ఆశాకిరణం, ప్రతి పేదింటికీ పెద్ద కొడుకుగా, తమ్ముడిగా, అన్నగా, మనవడిగా, మామయ్యగా నిలిచిన జగనన్నకు జై అంటూ నినాదాలతో పట్టణం మారుమోగింది.

సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర విజయవంతమైంది. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి జనం తండోపతండాలుగా తరలిరావడంతోనాయుడుపేట పట్టణంలో జాతరను తలపించింది. ముందుగా పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు విజయగణపతి ఆలయం వద్ద ప్రత్యేక పూజలతో యాత్ర ప్రారంభమైంది. అక్కడి నుంచి గాంధీమందిరం, పార్కు, గడియారం సెంటర్, వెల్‌కమ్ సెంటర్, పెద్ద దర్గామీదుగా పురవీధుల్లో బాణసంచా వేడుకలతో వేలాదిమంది జనం మధ్యన సామాజిక సాధికార ర్యాలీ సాగింది. ర్యాలీ సాగినంత సేపు వైఎస్సార్‌సీపీ నాయకులపై పూలు చల్లి పట్టణ ప్రజలు వారి అభిమానాన్ని చాటుకున్నారు. సాధికార బస్సు యాత్ర సాగుతున్నంత సేపు జై జగన్.. జైజై జగన్ అనే నినాదాలు మిన్నంటాయి. సాధికారయాత్ర పాత బస్టాండ్‌వద్దకు చేరుకోగానే అక్కడే వున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగతనేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, సావిత్రిభాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన వైఎస్సార్ ప్రతిమకు పూలమాలలు వేశారు. రాజ్యసభ సభ్యులు, రీజనల్ కో–ఆర్డినేటర్ వేణుంబాక విజయసాయిరెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రులు కళత్తూరు నారాయణ స్వామి, అంజాద్‌బాషా, జిల్లా పార్టీ అధ్యక్షులు, వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి పీ అనిల్‌కుమార్ యాదవ్, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ చక్రవర్తి, మేరిగ మురళీధర్, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి లాంటి పెద్దలందరూ జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆ తరువాత ముందుగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సభకు అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. ఆయన సూళ్లూరుపేట నియోజకవర్గంలో గడిచిన అయిదేళ్లలో రూ.3,470 కోట్లతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేశామన్నారు. సంక్షేమ పథకాల కింద డీబీటీ రూపంలో రూ.1,275 కోట్లు, నాన్ డీబీటీ కింద రూ.7,200 కోట్లు నిరుపేదల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా వెళ్లిందని చెప్పారు. అభివృద్ధికి, సంక్షేమానికి ఇంతకన్నా నిదర్శనం ఏమి కావాలన్నారు. అనంతరం డిప్యూటీ ముఖ్యమంత్రులు నారాయణస్వామి, అంజాద్‌బాషా, మాజీ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ ప్రసంగించారు.

బాబులంతా బెంబేలు

అనిల్‌కుమార్ యాదవ్ ప్రసంగిస్తున్నంత సేపు సభా ప్రాంగణమంతా చప్పట్లతో మారుమోగింది. ఇందులో ముఖ్యంగా ''ఇటీవల బాబులు తయారయ్యారంట.. చంద్రబాబు, లోకేష్‌బాబు, కల్యాణ్ బాబు, బాలయ్యబాబులట. ఈ బాబులందరినీ కట్టకట్టుకుని బంగాళాఖాతంలో కలిపేసే రోజు మన ముందుంది. జగనన్న కొట్టే దెబ్బకు ఈ బాబులంతా బెంబేలెత్తిపోవడం గ్యారంటీ.'' అని చెప్పడంతో జనమంతా చప్పట్లు కొట్టి సంఘీభావాన్ని తెలిపారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడ నడిబొడ్డున ఏర్పాటు చేసి దళితులకు ఒక గౌరవాన్ని తీసుకొచ్చారని అన్నారు. విచ్చేసిన అహుతులందరికీ ఎమ్మెల్యే కిలివేటి శాలువాలు కప్పి బుద్ధుడు బొమ్మలను బహూకరించారు. ఈ సభకు అశేష జనం తరలిరావడం విశేషం.



నేతలపై పూల వర్షం



ర్యాలీగా తరలివస్తున్న విజయసాయి రెడ్డి, నారాయణ స్వామి, కిలివేటి సంజీవయ్య, సత్యనారాయణ రెడ్డి



నేతలకు మహిళల అభివాదం



జగనన్న ప్లకార్డులతో అభిమానుల ర్యాలీ

● జై శ్రీరాం



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి సోమవారం బాల రాముని విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొననున్నారు. ఆయన ఆదివారం అయోధ్యకు చేరుకుని టీటీడీ తరఫున లక్ష లడ్డూలను రామ మందిరం ట్రస్టు ప్రతినిధులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, రామ మందిర ప్రారంభోత్సవంలో పాల్గొనే అదృష్టం తనకు దక్కడం పూర్వజన్మ సుకృతం అని తెలిపారు. – తిరుమల

చంద్రగిరిలో టీడీపీకి బిగ్ షాక్!



మస్తాన్‌కు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం (1983) నుంచి పార్టీ కార్యకర్తగా పని చేస్తూ ప్రస్తుతం చంద్రగిరి నియోజకవర్గ టీడీపీ మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా వున్న ఆర్‌ఎస్ మస్తాన్ తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ప్రభుత్వ విప్, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆయనకు ఆదివారం పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్ రెడ్డి విజయానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కరుడు కట్టిన టీడీపీ అభిమాని ఆర్ ఎస్ మస్తాన్ పార్టీలోకి రావడం పట్ల వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు చేగు ప్రశాంత్ గుప్తా, చంద్రగిరి మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ చేగు గోవర్ధన్ గుప్తా, చంద్రగిరి సర్పంచ్ రామ్మూర్తి, మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రమౌళి రెడ్డి, ప్రవీణ్ అభినందించారు.

టీడీపీలో కులాల కుమ్ములాట

- తిరుపతి టికెట్ కోసం కమ్మ, కాపు, యాదవ నేతలు
- ఎవరికి వారు చంద్రబాబును కలిసిన వైనం
- జనసేనకు క్యాడర్ లేదని తేల్చేసిన కమ్మ నేతలు
- మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు ఇస్తే పనిచేయమంటున్న కమ్మ నేతలు
- వెంకటగిరిలోనూ కమ్మ, యాదవ సామాజిక వర్గం నేతల కుమ్ములాట



సాక్షి, తిరుపతి : ఆ సామాజిక వర్గం నేతలకు టికెట్ ఇవ్వొద్దంటూ టీడీపీలోని కమ్మ, కాపు, యాదవ సామాజిక వర్గం వారు విడిపోయి కుమ్ములాడుకుంటున్నారు. పొత్తులో భాగంగా జనసేనకు ఇస్తే ఊరుకునేది లేదని టీడీపీ నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తిరుపతి, వెంకటగిరి అసెంబ్లీ టికెట్ల కేటాయింపు విషయంలో టీడీపీలో కులాల కుమ్ములాట తారాస్థాయికి చేరింది. తిరుపతి జిల్లాలో కీలకమైన తిరుపతి, వెంకటగిరి టికెట్ల విషయంలో ఇటు టీడీపీలోని కమ్మ, అటు జనసేన నుంచి కాపు సామాజిక వర్గం మధ్య విభేదాలు అధినేతలకు తలనొప్పిగా మారాయి. తిరుపతి అసెంబ్లీ టికెట్ జనసేన కోరుకుంటున్న విషయం తెలిసిందే. చిరంజీవి గతంలో తిరుపతి నుంచి పోటీ చేసి గెలిచిన విషయాన్ని గుర్తుచేసుకుంటూ.. పొత్తులో భాగంగా జనసేన ఇదే స్థానాన్ని అడుగుతోంది. టీడీపీ అధినేత కూడా తిరుపతి టికెట్ జనసేనకే కేటాయిస్తానని పవన్‌కు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. బాబు హామీ ఇవ్వడంతో పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్ ఎవరికి వారు తనకే టికెట్ అని ధీమాగా ఉన్నారు. మరో వైపు చంద్రబాబు తిరుపతి లాంటి కీలకమైన టికెట్ జనసేనకు కేటాయించడం ఇష్టం లేక మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు ఇప్పించేందుకు పథకం రచించారు. సుగుణమ్మకు జనసేన కండువా కప్పించి తన మనిషి అయిన ఆమెనే అభ్యర్థిగా ప్రకటించాలని బాబు ప్లాన్. ఈ పరిస్థితుల్లో తిరుపతి జిల్లాకు చెందిన కమ్మ సామాజిక వర్గం నేతలు జనసేనకు షాక్ ఇచ్చారు. జిల్లాలో కమ్మ సామాజిక వర్గం ఓట్లు బాగానే ఉన్నాయని, ఈ సారైనా తిరుపతి అసెంబ్లీ టికెట్ తమ వారికే కేటాయించాలని చంద్రబాబుని కలిసి డిమాండ్ చేసినట్లు సమాచారం. వెంకటగిరి సభ అయ్యాక కమ్మ సామాజిక వర్గం నేతలంతా కలిసి పరిస్థితిని బాబుకు వివరించినట్లు తెలిసింది. తిరుపతిలో జనసేనకు కేడర్ లేదని, కేవలం నలుగురైదుగురు మాత్రమే ఉన్నారని వివరించారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఏ రోజూ కమ్మ సామాజిక వర్గం వారికి విలువ ఇచ్చిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ ఆమెకే టికెట్ ఇస్తే తమని మతించే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేసినట్లు చర్చ జరుగుతోంది. ఆమెకు ఇస్తే ఎట్టిపరిస్థితుల్లో తామెవ్వరూ పనిచేయమని కమ్మ సామాజిక వర్గం నేతలు తేల్చిచెప్పినట్లు సమాచారం. ఎలాగైనా ఈ సారి తిరుపతి టికెట్ కమ్మ వారికే ఇవ్వాలని ఆ సామాజిక వర్గం నేతలంతా డిమాండ్ చేసినట్లు తెలిసింది. మరో వైపు యాదవ సామాజిక వర్గం నేతలు తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్‌ను తిరుపతి టీడీపీ అభ్యర్థిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నరసింహయాదవ్ మొదటి నుంచి టీడీపీ జెండా మోస్తున్న వ్యక్తి అని గుర్తు చేసినట్లు సమాచారం.

వెంకటగిరి కోటలో రచ్చ

తిరుపతి జిల్లా వెంకటగిరిలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చంద్రబాబు సమక్షంలోనే ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డిని అవమానించిన విషయం తెలిసిందే. వెంకటగిరిలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన రామకృష్ణకే టికెట్ కేటాయించాలనే విధంగా టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే అయిన ఆనం రాంనారాయణరెడ్డిని ప్రసంగించకుండా మాజీ ఎమ్మెల్యే అనుచరులు కేకలు వేస్తూ శుక్రవారం నాటి సభలో అడుగడుగునా అడ్డుపడిన విషయం తెలిసిందే. మరో బలమైన సామాజిక వర్గానికి చెందిన మస్తాన్ యాదవ్ వెంకటగిరి టికెట్ ఆశిస్తున్నారు. అందులో భాగంగానే చంద్రబాబు సభకు మస్తాన్ యాదవ్ భారీ ఏర్పాట్లు చేశారు. తమ సామాజిక వర్గం వారందరినీ వాహనాల్లో తరలించి బలాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేశారు. శ్రీఏడుకొండల స్వామి పాదపద్మాల కింద ఉన్న తిరుపతి జిల్లాలో యాదవ సామాజిక వర్గం ఓట్లు అధికంగానే ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా తిరుమలలో సన్నిధి గొల్లకు ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేశారు. ఈ పరిస్థితుల్లో తిరుపతి లేదా వెంకటగిరిలో ఏదో ఒక స్థానాన్ని యాదవ సామాజిక వర్గం వారికి కేటాయించాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. లేకపోతే ఎన్నికల్లో పనిచేయలేమని తేల్చిచెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

క్లుప్తంగా

గౌరిపెద్ది సేవలు అజరామరం



గౌరిపెద్ది రామసుబ్బ శర్మకు పుష్పాంజలి ఘటిస్తున్న టీటీడీ అధికారులు

తిరుపతి కల్చరల్: అన్నమయ్య సంకీర్తనలను వెలుగులోకి తేవడంలో గౌరిపెద్ది వారి సేవలు అజరామరమని స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ.కుమార్ తెలిపారు. అన్నమా చార్య కళామందిరంలో ఆదివారం సాయంత్రం గౌరిపెద్ది రామసుబ్బ శర్మ 33వ వర్ధంతి సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గౌరి పెద్దివారి సాహితీ వైభవం, సప్తచండి- నవ చండి గురించి తెలియజేశారు. తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనలు 27 పుటలను వెలికి తేవడంలో గౌరి పెద్ది విశేష కృషి చేశారని తెలిపారు. వైద్యానికి, ఉపాసనకు ఉన్న సంబంధాన్ని వివరించారు. ఎస్వీ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీతారామారావు గౌరి పెద్ది వారి పాండిత్యం, అవధాన పద్య సౌరభం అనే అంశంపై ఉపన్యసించారు. తొలుత ఎస్వీ ప్రాచ్య కళాశాల ప్రాంగణంలోని గౌరి పెద్ది విగ్రహానికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



మృతి చెందిన వంశీకృష్ణ

తడ: ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ జేపీ శ్రీనివాస రెడ్డి కథనం మేరకు నెల్లూరు జిల్లా, కావలి పరిధిలోని మద్దూరుపాడు గ్రామానికి చెందిన శివవంశీకృష్ణ(27) తడలోని ఓ ప్రైవేటు హోటల్లో పని చేస్తున్నాడు. బైక్‌పై సూళ్లూరుపేటకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో చేనిగుంట మలుపు వద్ద ట్రాక్టర్ అనూహ్యంగా అడ్డు రావడంతో ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న తడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, 8 నెలల పసికందు ఉన్నారు.

హనుమాన్ చాలీసా ఆద్యంతం ఆధ్యాత్మికం

- కోటి హనుమాన్ పారాయణ మహాయజ్ఞం
- పూర్ణాహుతితో ముగిసిన చాలీసా



మాట్లాడుతున్న హనుమద్ దీక్షా పీఠం దుర్గాప్రసాద్ స్వామీజీ

తిరుపతి కల్చరల్: లోకకల్యాణార్థం, అఖండ కోటి జీవరాసులకు శుభం కలగాలనే సత్సంకల్పంతో ఎస్వీ యూనివర్సిటీ క్రీడా మైదానంలో ఆదివారం శాస్త్రోక్తంగా చేపట్టిన హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం ఆద్యంతం ఆధ్యాత్మికంగా సాగింది. ఈనెల 22న అయోధ్య రామమందిరంలో బాలరాముని ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో రామచంద్రపుష్కరిణి వేదికపై అఖండ పారాయణం చేపట్టారు. టీటీడీ సహకారంతో హనుమత్ దీక్షా పీఠం దుర్గాప్రసాద్ స్వామీజీ ఆధ్వర్యంలో అఖండ హనుమాన్ చాలీసా పారాయణ సప్తాహం తొమ్మిది రోజుల మహాయజ్ఞం కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆదివారం ఎస్వీయూనివర్సిటీ క్రీడా మైదానంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం చేపట్టారు. హనుమత్ హవనం, సంగ్రహ రామాయణ హవనం చేపట్టారు. వందలాది మంది రామభక్తులు అత్యంత భక్తి ప్రపత్తులతో చేపట్టిన కోటి హనుమాన్ చాలీసా మహాపూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. దీనికి టీటీడీ జేఈవో సదా భార్గవి, ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్ అతిథులుగా హాజరయ్యారు. జేఈవో మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ట నేపథ్యంలో మానవాళి సుభిక్షను కాంక్షిస్తూ కోటి హనుమాన్ చాలీసా చేపట్టడం శుభ పరిణామమన్నారు. ఈ మహత్తర కార్యానికి టీటీడీ సహకారం అందించడం సంతోషకరమని తెలిపారు. ఆదర్శమూర్తి, తేజోమూర్తి అయిన శ్రీరాముని ఆదర్శంగా తీసుకొని ఆధ్యాత్మిక జీవన పయనం సాగించాలని, తద్వారా సమాజ శ్రేయస్సుకు దోహదపడాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, ముక్కాబుల పీఠాధిపతి శ్రీధర్‌స్వామీజీ, హైదరాబాద్ గీతాశ్రమం ప్రతినిధి సాయినాథ్ బాబా, లలితా పీఠం స్వస్వరూనందస్వామిలతో పాటు వివిధ ఆశ్రమ పీఠాధిపతులు పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణం విశిష్టతను గురించి తెలియజేశారు. శ్రీసీతారాముల ధర్మనిరతిని, భక్తాగ్రేసరుడైన హనుమంతుని స్వామి భక్తిని వివరించారు. సోమవారం నాడు అయోధ్య రామ మందిరం, బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా రామచంద్ర పుష్కరిణి వేదికపై ఆదివారం రాత్రి 8 నుంచి సోమవారం సాయంత్రం వరకు రాజగోపాల్ నాయుడు భక్త బృందంచే అఖండ హరినామ సంకీర్తన నిర్వహించనున్నారు. అనంతరం శాంతి కల్యాణం, సాయంత్రం 6 గంటలకు దీపోత్సవం చేపట్టనున్నారు.

రామాలయాలకు మైక్‌సెట్‌ల వితరణ



మైక్ సెట్‌ను అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా శ్రీరామ మందిరాలకు రూ.25 వేలు విలువ చేసే మైక్ సెట్‌లను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పంపిణీ చేశారు. తిరుపతిరూరల్ మండలం పద్మావతిపురంలోని శ్రీ కోదండ రామాలయానికి ఆదివారం మోహిత్ రెడ్డి మైక్ సెట్‌ను అందజేశారు. అంతకు ముందు ఆలయంలో సీతా లక్ష్మణ సమేత కోదండ రామస్వామిని దర్శించుకున్నారు. మోహిత్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని రామాలయంలో వేకువ జామున వచ్చే సుప్రభాతం, శ్రీరామ నామ సంకీర్తనలు, భక్తి పాటలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తనకు రోజు ప్రారంభమయ్యేదని గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గంలో రామాలయం లేని గ్రామం లేదన్నారు. అయోధ్య శ్రీ రామ జన్మ భూమి తీర్థక్షేత్రం పిలుపు మేరకు సోమవారం సామూహిక రామనామ సంకీర్తనలు, ప్రసాదాల పంపిణీ చేపట్టాలని కోరారు. ఆలయ ఇతర అవసరాలకు రూ.20 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో పద్మావతిపురం డివిజన్ అధ్యక్షులు నల్లపురెడ్డి లోకేశ్వర్ రెడ్డి, పద్మావతి పురం సర్పంచ్ గరికపాటి రాజేంద్ర, మాజీ సర్పంచ్ గణపతి నాయుడు, పార్టీ కన్వీనర్లు, వార్డు మెంబర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సెబ్ ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: జిల్లాలో పలువురు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) విభాగానికి చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ అనంతపురం సెబ్ డీసీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు అర్బన్ ఎస్‌ఐ రామ్‌ప్రసాద్ సత్యసాయి జిల్లా మడకశిరకు బదిలీ కాగా, చిత్తూరు రూరల్‌లోని మోహన్ బాబు కడప జిల్లాలోని బద్వేలుకు, కార్వేటినగరంలోని కె.భాస్కర్ అనంతపురం జిల్లా డీటీఎఫ్‌కు, బి.జయశంకర్ తిరుపతి జిల్లా చంద్రగిరికి, నగరిలోని భానుప్రకాష్‌ను సత్యసాయి జిల్లా తనకల్లుకు, పలమనేరులోని బి.రామదాసును కడప డీటీఎఫ్‌కు బదిలీ అయ్యారు. అలాగే పుంగనూరులోని అశోక్‌కుమార్‌ను తిరుపతి రూరల్‌కు, పులిచెర్లలోని కామేశ్వరనాయుడిని అన్నమయ్య జిల్లా రాయచోటి డీటీఎఫ్‌కు, వి.కోట చెక్‌పోస్టులోని రమణరాజును తిరుపతి జిల్లా పుత్తూరుకు, ఎన్‌ఆర్‌పేట చెక్‌పోస్టులోని వెంకటరత్నంను అనంతపురం జిల్లా కంబదూరుకు, క్యాటిల్‌ఫాం చెక్‌పోస్టులోని విజయ్‌కుమార్‌ను అనంతపురం జిల్లా కల్యాణదుర్గానికి, చిత్తూరు డీటీఎఫ్‌లోని మస్తాన్‌వలీని సత్యసాయి జిల్లా మడకశిరకు, చిత్తూరు ఇంటెలిజెన్స్‌లోని పృథీరాజ్‌ను కర్నూలు జిల్లా పంచలింగాలకు బదిలీ చేశారు. అలాగే పలమనేరులోని రామ్మూర్తి కర్నూలు జిల్లా హన్మకొండకు, చిత్తూరు డీటీడబ్ల్యూ ఎస్‌ఐ బాబు కర్నూలు జిల్లా సుంకేశులకు బదిలీ అయ్యారు.

బ్రాహ్మణ పరిచయ వేదికకు విశేష స్పందన



వివాహ పరిచయ వేదిక సమాచార పత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, తిరుపతి బ్రాహ్మణ సమాజం సంయుక్త ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని వైఖానస ఆశ్రమం కల్యాణ వేదికపై ఆదివారం నిర్వహించిన రాష్ట్ర బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. అత్యంత సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన వేదికకు సుమారు 700 మంది బ్రాహ్మణ బంధువులు హాజరయ్యారు. బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామ రాజు, తిరుపతి బ్రాహ్మణ సమాజం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి బ్రాహ్మణుడు సంప్రదాయ పద్ధతులను అనుకరిస్తూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, తద్వారా సమాజ శ్రేయస్సులో భాగస్వాములు కావాలని కోరారు. వివాహ పరిచయక వేదికకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. దీనికి ముందు రామశర్మ, గంగాధర్, చక్రపాణి ఆధ్వర్యంలో వృద్ధ దంపతులకు వేడుకగా షష్టిపూర్తి నిర్వహించి వారికి పట్టువస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం ఉపాధ్యక్షుడు సనత్‌కుమార్, చక్రవర్తి రాఘవన్, కొత్తపల్లి విజయ్‌కుమార్, రవిరాజు, లోచన్ శర్మ, వేదం హరిప్రసాద్, పట్టాభిరామారావు, మల్లిఖార్జునప్రసాద్ కృష్ణమూర్తి, సంధ్యారాణి, నాగ సుధారాణి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, గూడూరు, పుంగనూరు, మదనపల్లి, పుత్తూరు, నెల్లూరు జిల్లాల బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, బ్రాహ్మణ కుటుంబీకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే వన్నె కులస్తుల సంక్షేమం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి: వైఎస్సార్‌సీపీతోనే వన్నెకుల క్షత్రియుల సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం స్థానిక పీఆర్ గెస్ట్‌హౌస్‌లో శ్రీకాళహస్తి నియోజకవర్గ స్థాయి వన్నెకుల క్షత్రియ రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వన్నెకుల క్షత్రియులంతా వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వన్నెకుల క్షత్రియులందరినీ ఏకతాటిపైకి తీసుకురావాలని కోరారు. ఇందుకోసం సమన్వయ సమావేశం నిర్వాహణపై చర్చించారు. నాయకులు వడ్లతాంగల్ బాలాజీప్రసాద్‌రెడ్డి, బుజ్జిరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, మధురెడ్డి, పెరుమాళ్ రెడ్డి, రత్నంరెడ్డి, జీవీకేరెడ్డి, మునికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



అలిపిరి పాదాల మండపం వద్ద పూజలు చేస్తున్న రజక, బీసీ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: కులవృత్తే జీవనాధారంగా బతుకులు వెళ్లదీస్తున్న రజకులను ఎస్సీ జాబితాలో చేర్చి ఆదుకోవాలని జాతీయ దోబీ మహాసంఘ్ జాతీయ అధ్యక్షుడు అన్నవరపు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ ఆయన తిరుపతి నుంచి విజయవాడ వరకు తలపెట్టిన మహా పాదయాత్ర ఆదివారం తిరుపతిలో ఘనంగా ప్రారంభమైంది. అలిపిరి పాదాల మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు సమర్పించారు. ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీలుగానూ, 11 రాష్ట్రాల్లో ఓబీసీలుగా అసమానతలతో కొనసాగుతున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఈ మహా పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. దీనికి కర్ణాటక చిత్రదుర్గ పీఠాధిపతి బసవమాసుదేవ స్వామి, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి మహా పాదయాత్రను ప్రారంభించారు. రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ రజక సంఘ నేత నాగమల్లేశ్వరరావు ఆకాంక్ష నెరవేరాలని కోరారు. బీసీ సంక్షేమ సంఘ నేతలు కుమ్మర క్రాంతికుమార్, నాగరాజగౌడ్, రజక సంఘ నేతలు మల్లెమొగ్గల ఉమాపతి, సుధాకర దేవానంద్, దాము, యశోద, బాలయ్య పాల్గొన్నారు.



దూసుకొస్తున్న కోడెగిత్తలను నిలువరిస్తున్న యువకులు



ఎడ్లపందేల వద్ద గుమికూడిన జనం

- పలకల కోసం పోటీ పడిన యువకులు
- జల్లికట్టు తిలకించేందుకు పెద్దఎత్తున తరలివచ్చిన జనం

రంకెలేసిన కోడెగిత్తలు

వెదురుకుప్పం: యువత కేరింతలు.. రంకెలేసిన కోడెగిత్తలు.. పలకల కోసం పోటీపడుతున్న యువత కేకలతో ఆదివారం మండలంలోని మాంబేడు గ్రామంలో జరిగిన జల్లికట్టు దుమ్ము రేపింది. సంక్రాంతి సంబరాలలో భాగంగా ఇక్కడ ఎడ్ల పందేలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా నిర్వహించిన ఈ పశువుల పందేలు హోరెత్తించాయి. ముందుగా ఎడ్లకు పలకలు, వస్త్రాలతో పాటు బెలూన్‌లు కట్టి పందేనికి సిద్ధం చేశారు. అంతకు ముందే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్న యువత అల్లి వద్ద పలకల కోసం నిలబడ్డారు. పందేనికి సిద్ధం చేసిన ఎడ్లను నిర్వాహకులు ఉసిగొల్పి అల్లివద్ద వదిలారు. ఈలలు వేస్తూ తరిమిన కోడెగిత్తలు రంకెలేసుకుంటూ జనాలపై దూసుకుపోయాయి. ఎడ్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీ పడ్డారు. పలకలు పట్టిన యువత తమ విజయ దరహాసంతో చిందులు వేశారు. అయితే కొన్ని ఎడ్లు జన ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా యువతకు చిక్కకుండా పరుగులు తీశాయి. ఈ నేపథ్యంలో పలువురు పశువుల కింద పడి గాయాలపాలయ్యారు. ఎడ్ల పందేలు కోలాహాలంగా జరిగాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారితో గ్రామం కిక్కిరిసింది.



జనం మధ్య నుంచి దూసుకుపోతున్న కోడె గిత్తలు

ఎడ్లను పందేనికి వదులుతున్న సమయంలో యువకులు ఈలలు, అరుపులు హోరెత్తాయి.

అల్లరి మూకల ఆగడాలు

దూసుకుపోతున్న కోడెగిత్తలను నివారించి పలకలు పట్టే క్రమంలో ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. గ్రామంలో నిర్వహించిన జల్లికట్టులో టీడీపీ, జనసేనకు చెందిన అల్లరి మూకలు అల్లర్లు సృష్టించారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించాల్సిన ఎడ్ల పందేలు టీడీపీ, జనసేనకు ప్రచార యావగా మారడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రగిరి నియోజకవర్గం నుంచి గ్రామానికి వచ్చిన యువకులు వ్యవహరించిన తీరుతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈచనేరిలో పశువుల పందేలు

తవణంపల్లె: మండలంలోని ఈచనేరిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభిమానులు, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి యూత్, సర్పంచ్ ఉమామహేశ్వర రెడ్డి, ఈచనేరి యువత ఆధ్వర్యంలో ఎద్దుల పరుగు పందేలను నిర్వహించారు. చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి సుమారు 80 ఎద్దులు పరుగు పందెంలో పాల్గొన్నాయి. ఈ పందేలను తిలకించడానికి యువకులు, ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేశారు. పరుగులు తీస్తున్న ఎద్దులకు నిలువరించడానికి యువత ఉరకలు తీశారు. ఎద్దులు జనాలపైకి దూసుకు రాడంతో ఇద్దరికి స్వల్ప గాయాలు తగిలాయి. ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనంతరం పరుగు పందెంలో గెలిచిన 10 ఎద్దులకు బహుమతులను ప్రదానం చేశారు.

పంటలపై ఏనుగుల దాడి

చంద్రగిరి: మండల పరిధిలోని యల్లంపల్లి పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు, మామిడితోటలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతుల కథనం మేరకు, ఎగువ కూచివారిపల్లి ఎస్టీ కాలనీ సమీపంలో ఏడు ఏనుగుల గుంపు మూడు రోజులుగా తిష్టవేసింది. సమాచారం అందుకున్న అటవీ అధికారులు వాటిని తరిమేసేందుకు శతవిధాలుగా ప్రయతిస్తున్నారు. యల్లంపల్లెలోని వినోద్, వెంకట్ రెడ్డి, మునికృష్ణ యాదవ్‌కు చెందిన సుమారు 6 ఎకరాలకు పైగా వరి పంటను తొక్కి నాశనం చేశాయి. అదే గ్రామానికి చెందిన నాగిరెడ్డికి చెందిన అరటి, మామిడితోటలను ధ్వంసం చేశాయి. నెలన్నర క్రితం వరి పంటను వేస్తే ఏనుగుల గుంపు పూర్తిగా ధ్వంసం చేశాయంటూ రైతులు లబోదిబోమంటున్నారు. దీంతో అటవీ సమీప గ్రామ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



విచారిస్తున్న సీఐ అంజుయాదవ్

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేసి, కిడ్నాప్ చేసిన సంఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే, టీడీపీ నాయకుల ప్రచార రథాన్ని పక్కకు పెట్టాలని చెప్పడంతో మురళికి, టీడీపీ నాయకులకు మధ్య శనివారం సాయంత్రం గొడవైంది. మురళి సమీప బంధువు, టీడీపీ నేత ప్రతాప్ రెడ్డి రాత్రి 11 గంటలకు ఫోన్ చేసి అమరజ్యోతి కల్యాణ మండపం వద్దకు రావాలని చెప్పాడు. వెంటనే అక్కడికి వెళ్లిన మురళిని టీడీపీ నాయకులు, బొజ్జల సుధీర్ రెడ్డి అనుచరులు నాగమల్లి దుర్గ, వినయ్ కలిసి కొట్టి, కాళ్లు కట్టేసి కారులో వేసి తీసుకెళ్లారు. అక్కడి నుంచి ఊరందూరులోని బొజ్జల నివాసానికి తీసుకెళ్లి ఆయన కాళ్ల దగ్గర పడేశారు. బొజ్జల సుధీర్‌రెడ్డి మురళిని చితకబాదాడు. అనంతరం దుర్గ తుపాకీ తీసి కాల్చిపారేస్తానంటూ బెదిరించాడు. అక్కడి నుంచి రాత్రంతా మురళిని కారులో తిప్పుతూ వేకువజామున ఆర్చి వద్ద పడేసి వెళ్లిపోయారు. అక్కడి నుంచి స్నేహితుల సాయంతో ఆస్పత్రి కెళ్లి చికిత్స పొందాడు. అనంతరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలోనే సీఐ అంజూయాదవ్ టీడీపీ నాయకుల సమక్షంలో మురళిని విచారించారు. దీనిపై కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. అయితే ఈ పరిణామాల అనంతరం తమపై వైఎస్సార్‌సీపీ నాయకులు కులం పేరుతో దుర్భాషలాడారంటూ బొజ్జల సుధీర్‌రెడ్డి డ్రైవర్ ఫిర్యాదు చేయడం కొసమెరుపు. రెండు కేసులు నమోదు చేసి, విచారించనున్నట్లు సీఐ తెలిపారు.